# సుగాత్రి

'అమ్మాయీ, ఇటురా' పిలిచాడు శారదాంబకు నిత్యపూజ సలిపే ఆ ఇంటి పూజారి. సుగాత్రి ప్రసాదం తీసుకొని కళ్ళకద్దుకుంది. దగ్గరే వున్న శాలీనుడు కూడా శారదాదేవికి నమస్కరించి ప్రసాదం తీసుకున్నాడు.

శాలీనుడు పడకటింటివైపు నడిచాడు. నూనూగు మీసాలతో, దృఢమైన శరీరంతో, నూత్నయౌవనం తొణికిసలాడుతూంటే, చూడముచ్చటగా నున్న అల్లుణ్ణి, బంగారు బొమ్మలా వున్న అయ్మాయిని చూస్తూ అమ్మవారుకి నమస్కరించింది సుగాత్రి తల్లి.

శాలీనుని మనఃప్రవృత్తిలో ఒక ప్రత్యేకత వుంది. పచ్చని చేలని, పండు వెన్నెలని, ప్రేమ్మించే మనసతనిది. ప్రకృతి సౌందర్యానికి పరవశించే మనసతనిది. సహజ సౌందర్యమంటే ఎంత సుముఖతో, కృత్రిమ అలంకరణ అంటే అంత విముఖత శాలీనునికి.

ఆనాడు పడకటింటిలో పందిరిపట్టుమంచం పూలతో అందంగా అలంకరింపబడింది. అత్తరు, సుగంధం, గదినిండా వ్యాపించింది. సుగాత్రిని చెలులు ఎంతో శ్రద్ధగా అలంకరించారు. సుగాత్రి నిలువెల్ల ఆభరణాలతో మెరిసిపోతోంది. గదినిండా మల్లెలు, జాజులు, సంపెంగలు ఘుమఘుమలాడుతోంటే శయనాగారంలో అడుగుపెట్టింది సుగాత్రి–చెలులు తలుపువేసి బయట కిలకిలా నవ్వుకొన్నారు. గదిలో అడుగుపెట్టిన సుగాత్రి వంక చూశాడు శాలీనుడు. నిలువెల్ల ఆభరణాలే – ముక్కున ముక్కెర మెరుస్తోంది. కర్ణాభరణాలు ధగధగలాడుతున్నాయి. నడుముకి వడ్డాణం, చేతినిండా గాజులు, మెడనిండా నగలు – కాళ్ళకి కడియాలు, అందెలు. శాలీనుడు సుగాత్రి వంక చూసాడు. –సుగాత్రి ఏదీ ఆమె నిజరూపమేదీ – అతనికి ఒళ్ళు జలదరించింది. –సుగాత్రి రూపమేదో తెలియటం లేదు. ఈ కృత్రిమాలంకారాలు సహజ సౌందర్యాన్ని కప్పివేస్తుంటే, శాలీనుడు నిట్టూర్చాడు. ఆమెవంక చూడాలనే భావం మనసుకి కలుగలేదు. –అటు వత్తిగిలి పడుకున్నాడు. – అంతే, ఆ మొదటి రాత్రి అలాగే గడిచిపోయింది. – భర్త కౌగిట చేరే భాగ్యమే లేని సుగాత్రి బయటికి రాగానే చెలులు పకపకా నవ్వారు – గుసగుసలాడారు.

మళ్ళా రాత్రయింది. సుగాత్రిని ఇంకా గొప్పగా అలంకరించారు...మోయలేనంత బరువైంది పూలజడ – మెడ తిప్పరానన్ని నగలు మళ్ళా శాలీనుడు ఆమె వంక చూడలేదు. చీర నలగకుండ, జడపూలు జారకుండా అలానే గది బయటకొచ్చిన సుగాత్రిని చూసారంతా – తల్లికి ఏం చేయాలో తోచటంలా. అల్లుడిపైన కోపం పట్టరానిదైంది. – నా పిల్లకి సుఖం లేకపోయాక ఇల్లరికపుటల్లుడు దేనికి, నా సంపద దేనికోసం – ఆపిల్ల కడుపుపండితే, ఓ మగకూన నాకళ్లబడితే వాణ్ణి చూసుకు బతకాలని కాదూ! సుగాత్రి తల్లికళ్ళు నిప్పులు కురుస్తున్నాయి – "సుగాత్రి, సుగాత్రి" పెద్దకేక పెట్టింది. తల్లి గయ్యాళితనం తెలియంది కాదు సుగాత్రికి. ఆ కోపంలో ఏమాటలంటుందో, భర్త బాధపడతాడని భయంగా గజగజలాడుతూ తల్లి ముందుకు వచ్చింది సుగాత్రి.

"అమ్మా – కోపగించకమ్మా – తొందరపడి నా భర్తను నిందించకు – ఆ అమ్మవారి దయ కలుగకపోతుందా– నాకాపురం చక్కబడక పోతుందా, అమ్మా నాకో బిడ్డపుడితే"–

"ఆ – బిడ్డ పుట్టాల్సిందే – ఇంకెక్కడి బిడ్డ – నీ భర్త నిన్ను దగ్గరకేరానీడు – సంసారమే లేని నీకు సంతానమెక్కడిదే – నా సంపదంతా ఎవరికోసం – నీకు పుట్టే బిడ్డకోసంకాదూ – కానీ" తల్లి అరుస్తూంటే భర్త వింటాడేమోనని భయం. తల్లిని ఏమీ అనలేని సుగాత్రి కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఈ ఏడ్పులు నన్నేంచేయువు – నా భర్త నన్ను వదిలి దేశాలమీదికి పోతే, నిన్ను చూసుకొని కదూ నే బతుకుతోంది – ఈ సంపదంతా నీకు పుట్టే పిల్లలకోసం కదూ జాగ్రత్తపరుస్తోంది? ఇంక నేను చూడలేని నా కడుపు మండిపోతోంది.

"నిన్ను నాగారాల తల్లిని, ఇన్ని ఆభరణాలతో ఇంత అలంకరణతో పడకటింటికి పంపితే, ఛా, ఛా – ఏం మగాడు"– సుగాత్రి తల్లి గొంతుపెంచింది.
"అమ్మా – సుగాత్రి తల్లిని బతిమాలుతోంది.

'నా మాంగల్యం గట్టిదైతే అమ్మ నా పైదయ దలుస్తుంది– ఆయన మనసు గాయపరచకు"– పమిటతో కళ్ళు తుడుచుకొంది సుగాత్రి.

గదిలోనుంచి బయటకొచ్చిన శాలీనుడు వినీలాకాశం వంక చూస్తున్నాడు. ఓ ప్రక్కన తల్లి ఏమి దూషిస్తుందోనని బిక్కు బిక్కుమంటూ తలవంచుకొంది సుగాత్రి. –

"సుగాత్రీ విను – ఈ రోజునుంచీ నీ భర్త మన పూలతోటతో పనిచేయాలి."

"ఏనా"

"ఆ" - తోటమాలి పనిచేయాలి - మొక్కలకి నీళ్ళుపోయాలి, పాదులు తవ్వాలి, చెత్త, ఆకులు, ఎత్తిపొయ్యాలి - ఎరువు వేయాలి - పూలతోట రోజూ ఊడ్చాలి - ఇంకా-

"ఒళ్ళువంచి పనిచేస్తేనే తిండిపెట్టడం. ఒట్టిగొడ్డు తాకట్టులాగ"- తల్లి సణుగుతోంది. సుగాత్రి తల ఊపింది. - తన భర్తరేపటినుంచీ తోటపని చేయాలా - ఇంత ఐశ్వర్యవంతుల ఇంటి అల్లుడు తోటపని చేయటం బాధగానే వుంది. కానీ తనేం చేయగలదు!

శాలీనుడికి ఆనందంగానే వుంది తోటపని చేయమనటం. రకరకాల రంగులతో పరిమళాల పూలు పూయిస్తాడు తను అవన్నీ అందంగా మాలలచేసి శారదాంబకి సమర్పిస్తాడు.-తనెంత ధన్యుడో అత్తగారు తనకి తోటపని అప్పగించిందని మురిసిపోయాడు శాలీనుడు.

శాలీనుడు తోటలో ప్రవేశించింది మొదలు, చీకటి పడేదాకా ఉంటాడు, క్షణం విశ్రాంతి తీసుకోకుండా తోటపనిలో నిమగ్నుడయిపోతున్నాడు. -అతను ఎంత అలసి పోతున్నాడో - సుగాత్రికి చాలా దుఃఖం వస్తోంది తల్చుకొంటుంటే!

కాని శాలీనడు పని మొదలు పెట్టడంతోనే తోటంతా విరియబూసింది.-మల్లెలు, విరజాజులు, సన్నజాజులు, మందారాలు అన్నీ కలిసి ఆ తోట నందనోద్యానమయింది. తోటలోని ప్రకృతి సౌందర్యానికి పరవశించిపోయాడు శాలీనుడు.

ఆనాడు కుంభవృష్టి వర్షం. భూమ్యాకాశాలు ఏకం చేసింది. గాఢాంధకారం నలుదిక్కులా వ్యాపించింది. ఉరుములు మొదలయ్యాయి. ప్రకృతి ప్రళయ తాండవం చేస్తోంది. సుగాత్రి మనసు ఆవేదనచెందింది. తన భర్త అంతవర్షంలో ఏం కష్టపడుతున్నాడో ఏం చేయగలదు తను భర్తకు ఏం సహాయం చేయగలదు తను - మనసు విలవిలలాడింది.

అటు ఇటుచూచింది. -తల్లి లోపలెక్కడుందో-దగ్గర ఎవ్వరూ లేరు. అదే సమయమనుకుని, అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తోంది. సుగాత్రికి ఆశ్చర్యంగా వుంది. నీరు పక్కకి తొలగిదారి చూపిస్తున్నదా అనిపించింది. అమ్మవారిని తలచుకొని గబ గబా నడిచిన సుగాత్రి తోటచేరింది. -మరీ ఆశ్చర్యం-తోట చెక్కుచెదరలేదు. ఇందాకా పడ్డ గాలీవర్షం,పిడుగులు, తోటని ఏమి చేయలేదు - భర్త క్షేమంగానే ఉన్నాడు. అనుకుంటూ సుగాత్రి నెమ్మదిగా ఇల్లు చేరింది. "హమ్మయ్యా, తను వెళ్ళటం, రావటం, ఎవరూ గమనించలేదు"-

సుగాత్రి మనసు ఆనందంతో తేలిపోయింది. తను వెళ్ళి తన భర్తకి తోటపనిలో సహాయం ఎందుకు చేయకూడదూ. ధైర్యం గుండెల్లో చోటుచేసుకుంది. ఆనాడు సుగాత్రి గబగబా నడిచి తోటచేరింది. -భర్త పనిలో నిమగ్నమయ్యాడు. తన నగలన్నీతీసి మూటకట్టింది. మొక్కలకి పాదులు తవ్వింది. నీళ్ళుపోసింది. ఆకులు ఊడ్చింది. -శాలీనుడు విస్తుపోయి చూస్తున్నాడు చెమటతో సుగాత్రి శరీరం తడిసిపోయింది. భర్తకు దగ్గరగా కూచుని మొక్కలకు పాదులు తవ్వుతుంటే వక్షోజాలు ఎగసి ఎగసిపడుతున్నాయి. వంగి ఊడుస్తుంటే, నన్నని నడుము ఊగుతోంది. -శాలీనుడు సుగాత్రిని సమీపించి "నీలాంటి సుకుమారి ఇలాటి పనులు చేయకూడదు" అంటూ ఆ శ్వేద బిందువులు తన ఉత్తరీయంతో తుడిచాడు. ఆ స్పర్శకి పులకరించి పోయింది సుగ్రాతి. -శాలీనుడు ఆ సౌందర్యాన్ని తన కౌగిట్లో బంధించాడు. -ఆ ప్రకృతి రమణీయతకి వారివురూ పరవశించారు. ఆ పూలతోటే శయనాగారమైంది. -శృంగారకేళిలో తన్మయులైన ఆ దంపతులు అన్నీ మరిచిపోయారు. అంతలో సుగాత్రి భయంతో భర్త కౌగిలి విడిపించుకొని గబగబా, ఆభరణములు మూట విప్పి అలంకరించుకుని ఇంటికి దారితీసింది.

తన్నెవరూ - గమనించలేదనే భావం స్థిరపడటంతో ధైర్యం కొండంత అయింది సుగాత్రికి.

ఆ రోజూరాత్రి అలంకరించుకొని దగ్గరకు వచ్చిన సుగాత్రిని చూసిన శాలీనుడి మనసు వికలమైంది. తోటలో తనతోబాటు పనిలో చూసిన సుగాత్రికి, ఈ సుగాత్రికీ సంబంధం లేదని అనిపించి విముఖుడయ్యాడు. భర్త స్థితి అర్థంకాని సుగాత్రికి దుఃఖం ఆగలేదు.

ఆ తెల్లవారి తోటపనిలో భర్తకు సాయపడటానికి వచ్చిన సుగాత్రిని శాలీనుడు కౌగిట చేర్చుకున్నాడు మళ్ళా.

రాత్రి సుగాత్రిని అంగీకరించని భర్తవంక చూస్తూ నీ మనసులో మరో స్త్రీకి స్థానం వుంటే చెప్పు, అంటూ దీనంగా విలపించింది. శాలీనుడు మారుపలకలేదు.

కాని, పూలతోటలో తనతో శృంగార రాజ్యాన్నేలిన భర్త శయనాగారంలో ఎందుకు విముఖత చూపుతున్నాడోనని సుగాత్రికి ఆలోచించిన కొద్దీ అర్థమయింది. తన భర్తకి ఈ అలంకారాలు భూషణాలు గిట్టవన్నమాట-అదే నిజం!!

అమ్మాయి విహారార్థం తోటకి వెళ్ళి వస్తున్న విషయం తల్లికి తెలిసిపోయింది. -కాని కూతురు అల్లుడు ఏకమైనందుకు ఆనందంగా వున్నా ఆ తోటలో కాపురం మనసుకి బాధగానే ఉంది ఆమెకి.

"అమ్మా సుగాత్రి నీ భర్తమీద కోపంతో తోటపని చెప్పాను కానీ, నిజంగా మనకేం తక్కువ- అల్లు తోటపనులెందుకు చేయటం - ఈ విశాలమైన భవనంలో నీవు నీభర్త హాయిగా వుండండి.

"నీ నగలన్నీ అలంకరించుకో, నావికూడా వేసుకో - అంతే కానీ ఆ తోట కాపురం వద్దు-నామాట విను"- తల్లి బతిమాలుతోంది.

సుగాత్రి తల్లికి వెంటనే సమాధానం యియ్యలేదు. కొంతసేపాగి, 'అమ్మా - నాభర్తకి ఏది ఇష్టమో నాకదే ఇష్టం - నా భర్త మనసు నాకర్థమయిపోయింది. -"

సుగాత్రి చకచకా నడిచి శాలీనుడున్న తోటవైపు వెళ్ళి పోతుంటే, విస్తుపోయి చూస్తూ నిలబడింది తల్లి.

తోటపనిలో శాలీనునికి సాయంచేస్తూ అతని మనసులో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొంది సుగాత్రి.

- కావ్యతారలు - వనిత - ఏప్రిల్ 1990